క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హాలియా : అనుముల మండలంలోని యాచారం సబ్‌స్టేషన్ల పరిధిలోని వివిధ గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ బాలునాయక్ బుధవారం తెలిపారు. యాచారం సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని పేర్కొన్నారు. యాచారం సబ్‌స్టేషన్ పరిధిలోని అన్నారం, వెంకటాద్రిపాలెం, ముక్కమాల, కొసలమర్రి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం స్థానిక బార్ అసోసియేషన్ భవనంలో జరగనున్నాయని, అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేశామని బార్ అసోసియేషన్ ఎన్నికల చీఫ్ అధికారి ఏచూరి శ్రీనివాస్, అసిస్టెంట్ ఎన్నికల అధికారి సైదులు బుధవారం తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు పోలింగ్ ఉంటుందని, ఆ తరువాత కౌంటింగ్ ఉంటుందని పేర్కొన్నారు. కౌంటింగ్ అనంతరం ఫలితాలను వెల్లడించనున్నట్లు తెలిపారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

చింతపల్లి: మండల పరిధిలోని వెంకటంపేట శ్రీ భవాని రామలింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ప్రసాద్, శ్రీనివాస్, కృష్ణమాచారి రంగారావు, మోహన్‌రావు, కాయితి జితేందర్‌రెడ్డి, ధరణిపతి రమణారావు, యాదగిరి, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని సుందర్‌నగర్‌లో ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న 11మందిని బుధవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. వన్ టౌన్ సీఐ జి. సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. సుందర్‌నగర్ కాలనీలోని గాలి నాగేశ్వర్‌రావు ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసి సందీప్, రాజశేఖర్, సతీష్, మోహన్, రఘు, మల్లేష్, వీరన్న, లక్ష్మణ్, వెంకన్న, నరేందర్‌ను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.5వేలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

రెడ్‌క్రాస్ భవన్‌లో రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

నల్లగొండ టూటౌన్ : యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని చిరంజీవి యువత జిల్లా అధ్యక్షుడు అల్లుబెల్లి రామిరెడ్డి అన్నారు. సినీనటుడు రామ్‌చరణ్ జన్మదినం సందర్భంగా బుధవారం నల్లగొండలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రెడ్‌క్రాస్ భవన్‌లో పలువురు యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఇచ్చే రక్తం ఎంతో మందికి ఆపదలో ప్రాణాలు కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ నర్సిరెడ్డి, రామ్‌చరణ్ యువత అధ్యక్షుడు సురేష్, పట్టణ అధ్యక్షుడు హైమద్ పాల్గొన్నారు.

సరోజకు సావిత్రీబాయి పూలే అవార్డు



సరోజను సన్మానిస్తున్న మహిళలు

నల్లగొండ టౌన్ : అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ దండెంపల్లి సరోజకు సావిత్రిబాయి పూలే స్మారక అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మహిళలు సరోజను సన్మానించారు.

బహుమతులు అందజేత

నల్లగొండ: భారత ఆహార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 23 వరకు పోషకాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వంటల పోటీల్లో గెలుపొందినవారికి ఎఫ్‌సీఐ సీనియర్ అధికారి కె.ఎస్.కె. ప్రసాద్ బుధవారం బహుమతులు అందజేశారు.

నత్తనడకన 'గిరివికాసం'

- బోర్లు వేశారు.. మోటార్లు మరిచారు
- ముందుకు సాగని భూమి అభివృద్ధి పనులు



ఘాశీరాంతండాలో వేసిన బోరు

గుర్రంపోడు: గిరిజన రైతుల భూములను సాగులోకి తెచ్చేందుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా అమలవుతున్న గిరివికాస పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయి. 2022 జూన్‌లో దరఖాస్తులు స్వీకరించి మార్చిలో లబ్ధిదారుల ఎంపిక నిర్వహించి బోర్లు వేశారు. ఈ బోర్లు వేసి మూడు నెలల గడిచినా మోటార్ల ఊసే లేదు. కరెంటు, భూమి అభివృద్ధి పనులు అడుగు కూడా ముందుకు సాగడం లేదు. తేనపల్లి తండా, ఘాశీరాంతండా గ్రామాల్లో జలవనరుల శాఖ సర్వే ఆధారంగా గుర్తించిన 16 మంది లబ్ధిదారుల భూముల్లో బోర్లు వేయగా ఏడు బోర్లలో నీరు వచ్చింది. మరో ఐదు బోర్లలో కొద్దిగా నీరు వచ్చింది. వీటిన్నంటికీ మోటార్లు త్వరగా ఇస్తే ఆరుతడి పంటలు సాగు చేసుకుంటామని రైతులు పేర్కొంటున్నారు.

ప్రతిపాదనలకు నోచుకోకపోవడంతో..

ఆర్థిక స్థోమత లేక సొంతంగా బోరు, మోటారు, విద్యుత్ సౌకర్యం కల్పించుకోలేక మెట్ట పంటలనే నమ్ముకుని ఎదుగు బొదుగు లేని జీవితాలు గడుపుతున్న గిరిజనులను గుర్తించి వారి భూములను సాగులోకి తేవడమే గిరి వికాసం పథకం ఉద్దేశ్యం. కరెంటు సౌకర్యం కల్పనకు విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు అవసరమైన ఎస్టిమేషన్ వేయాల్సి ఉంది. అదేవిధంగా ఉపాధిహామీ పథకం కింద ఈ భూముల్లో రాళ్ల తొలగింపు, వాలుకు అడ్డుకట్టలు వేయడం, పాంఫాండ్‌ల నిర్మాణం లాంటి పనులన్నీ చేపట్టి నేలను పంటల సాగుకు అనుకూలంగా చదును చేయాల్సి ఉంది. అయితే ఈ పనులు ప్రతిపాదనలకు కూడా నోచుకోక భూములు సాగులోకి వచ్చేదెప్పుడో అని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.

తక్షణమే మోటార్లు ఇవ్వాలి



బోరు వేసి మూడు నెలలు గడిచినా ఇంతవరకు మోటారు ఇవ్వలేదు. కరెంటు మోటారు ఇస్తే విద్యుత్ లైన్లు వేసే వరకు పక్క రైతుల మోటార్ల వద్ద నుంచి కరెంటు తీసుకుని ఆరుతడి పంటలను వేసవిలో సాగు చేసుకుంటా. కూరగాయల పంటలను సాగుచేసుకునేందుకు వీలుంటుంది.

– రమావత్ పాండు

ప్రతిపాదనలు పంపించాం



గిరివికాస పథకానికి సంబంధించి మోటార్లకు ప్రతిపాదనలు పంపించాం. కరెంటు, ఇతర పనులు కూడా పూర్తి చేసి భూములను సాగులోకి తెస్తాం. ఉపాధిహామీ పథకం కింద నేల అభివృద్ధి పనులు చేపడతాం.

– మంజుల, ఎంపీడీఓ

మున్సిపల్ చైర్‌పర్సన్ బాధ్యతల స్వీకరణ

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా తిరుమలకొండ అన్నపూర్ణ, వైస్ చైర్మన్‌గా ఆదాసు నాగరాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఉన్న చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌లపై పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో ఇటీవల నూతనంగా చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం అన్నపూర్ణ మాట్లాడుతూ నందికొండలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని తెలిపారు. నిత్యం తాగునీరు అందించడంతో పాటు డ్రెయినేజీ సమస్యను తీర్చేందుకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఈర్ల రామకృష్ణ, తిరుమలకొండ మోహన్‌రావు, మంగ్తానాయక్, రమేష్, నాగశిరీష పాల్గొన్నారు. కార్యక్రమంలో శంకర్, ఆదాసు విక్రమ్, నాగరాజు, మోహన్ నాయక్, రంగారెడ్డి, జంగయ్య, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న చైర్‌పర్సన్ అన్నపూర్ణ

కోదండ రామాలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ: మండలంలోని ముల్కలకాల్వ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామాలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మట్టపల్లి సైదయ్యయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ వెలిశెట్టి రామకృష్ణ, మాజీ సర్పంచ్ బోగబోయిన రాజు, నాయకులు సకినాల హరిప్రసాద్, రవీంద్ర, వరప్రసాద్, హన్ను, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమీషన్ పెంచాలని పెట్రోల్ బంక్ డీలర్ల ధర్నా



వినతిపత్రం అందజేస్తున్న పెట్రోల్ బంక్ డీలర్లు

మిర్యాలగూడ: కమీషన్ పెంచాలని జిల్లా పెట్రోల్ బంక్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మిర్యాలగూడ ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐఓసీఎల్ డీలర్ల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి విజయ్‌కుమార్ మాట్లాడుతూ పెరిగిన ఖర్చులతో డీలర్లకు బంకుల నిర్వహణ కష్టంగా మారిందన్నారు. మార్కెట్ హెచ్చుతగ్గుల కారణంగా డీలర్లు ప్రతి నెలా కొంత నష్టపోతున్నారన్నారు. అనంతరం హెచ్‌పీసీఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎరమాద శ్రీనివాస్ మాట్లాడుతూ పెరిగిన ధరలతో బంక్ నిర్వాహకులు ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి కమీషన్ పెంచాలని కోరారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధైద రవీందర్, హరిప్రసాద్, శ్రీనివాస్‌నాయక్, శ్రీను, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

30న సన్నాహక సమావేశం

కొండమల్లేపల్లి: హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని మఠంపల్లిలో ఈనెల 30న నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు టీపీసీసీ కోఆర్డినేటర్ ఎంఏ సిరాజ్‌ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షి, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడ మండలంలోని ముల్కలకాల్వ గ్రామంలో శ్రీ కోదండ రామాలయం ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజలు

మాడుగులపల్లి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మాడుగులపల్లి మండలంలోని తోపుచర్ల గ్రామంలో బుధవారం రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ మంగ యాదయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



కోదండ రామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

విస్తృతంగా వాహనాల తనిఖీ



మాల్ వెంకటేశ్వరనగర్‌లో చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

చింతపల్లి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చింతపల్లి మండలంలోని మాల్ వెంకటేశ్వరనగర్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద బుధవారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్ నుంచి మల్లేపల్లి వైపుకు వెళ్తున్న వాహనాలను, మల్లేపల్లి నుంచి హైదరాబాద్ వైపుకు వెళ్తున్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు.

చలివేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి



చలివేంద్రం ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

దేవరకొండ: చలి వేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ కోరారు. బుధవారం దేవరకొండ బస్టాండ్ ఆవరణలో వాసవి, వాసవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆర్టీసీ ట్రాఫిక్ మేనేజర్ సైదులుతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత 20ఏళ్ల నుంచి చలివేంద్రం ఏర్పాటు చేసి ఎంతో మంది దాహార్తిని తీర్చడం అభినందనీయమన్నారు. ముున్ముందు క్లబ్ సేవలను మరింత విస్తృతం చేయాలని కోరారు. కార్యక్రమంలో 104ఏ రీజియన్ చైర్మన్ కొండూరు శోభన్‌బాబు, నీలా భిక్షమయ్య, తొనుకునూరి విజయ, పానుగంటి మల్లయ్య, లకుమారపు మల్లయ్య, అర్థం రమేష్, నీలా సంజీవ్‌కుమార్, ఆలంపల్లి పద్మ, బెలిదె మాధవి తదితరులున్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ పట్టణానికి చెందిన శ్రీనివాసరావు పెయింటర్‌గా పనిచేస్తూ కొండమల్లేపల్లిలో భార్యతో కలిసి లేడీస్ కార్నర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజుమాదిరిగా మంగళవారం ఇంటికి తాళం వేసి వెళ్లారు. రాత్రి ఇంటికి వచ్చి చూసేసరికి ఇంట్లో దాచిన 4 తులాల బంగారంతో పాటు రూ.50 వేలు నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ పేర్కొన్నారు.

ప్రజా ఉద్యమాలను బలపరచాలి



ప్రజా సంఘాల సభ్యత్వాన్ని అందజేస్తున్న సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్

మిర్యాలగూడ అర్బన్: ప్రజా హక్కుల కోసం జరిగే ప్రజా పోరాటాలను బలపరచాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సంఘాల సభ్యత్వ నమోదును ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజా ఉద్యమాలతోనే అందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో కరువు విలయతాండవం చేస్తుందని, ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా అధికారులు చూడాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడావత్ రవినాయక్, సీఐటీయూ జిల్లా నాయకులు మల్లు గౌతమ్‌రెడ్డి, వినోద్‌నాయక్, మోహన్‌నాయక్, వెంకటేశ్వర్లు, అప్పారావు తదితరులున్నారు.

పవర్‌లూమ్ కార్మికులకు కూలి రేట్లు పెంచాలి



వినతిపత్రం అందజేస్తున్న దండెంపల్లి సత్తయ్య

నల్లగొండ టౌన్ : పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా పవర్‌లూమ్ కార్మికులకు కూలి రేట్లు పెంచాలని కోరుతూ బుధవారం పవర్‌లూం యాజమానుల సంఘం జిల్లా అధ్యక్షుడు చెరుపల్లి శ్రీనివాస్‌కు పవర్‌లూమ్ కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ ప్రస్తుతం ఇస్తున్న కూలి రేట్లపై 40 శాతం పెంచి ఇవ్వాలన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు పనివేళలు ఉండాలన్నారు. కార్యక్రమంలో పెండెం రాములు, గంజి నాగరాజు, బుచ్చిరాములు, పసునూరి యోగానందం, సూరపల్లి భద్రయ్య, దేవులపల్లి గిరిబాబు, నిమ్మగోటి సైదులు, గంజి చంద్రయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

మిర్యాలగూడ: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని ఆర్డీఓ శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం మిర్యాలగూడ ఆర్డీఓ కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇండియన్ పెట్రోల్ బంక్ ఎదురుగా, శెట్టిపాలెం, వేములపల్లి మండలం, ఆలగడప ఎక్స్‌రోడ్డు, జాన్‌పహాడ్ రోడ్డు, దామరచర్ల మండలంలోని వాడపల్లి వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎవరైనా ఫిర్యాదులు చేయాలనుకుంటే స్థానిక ఆర్డీఓ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో సీ- విజిల్ యాప్ ద్వారా కూడా ఫిర్యాదు చేయొచ్చన్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా ర్యాలీలు, మీటింగ్‌లకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హోం ఓటింగ్‌పై బీఎల్‌ఓలకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రవి

నల్లగొండ : లోక్‌సభ ఎన్నికల్లో 85 ఏళ్లు పైబడిన వారు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఇప్పటికే ఓటును ఇంటి నుంచి వినియోగించుకోవాలనుకునే వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. వచ్చిన దరఖాస్తులను ఏ విధంగా పరిశీలించి వారికి ఓటు హక్కును కల్పించాలనే విషయమై నల్లగొండ మండలానికి సంబంధించిన బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆర్డీఓ రవి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేలా బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ సూచించారు.

నల్లగొండలో ఆగని మిర్యాలగూడ బస్సులు!

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ డిపో నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న పలు ఆర్టీసీ బస్సులు నల్లగొండలో నిలపడం లేదని పలువురు ప్రయాణికులు పేర్కొంటున్నారు. సాయంత్రం వేళల్లో తమ డ్యూటీలను ముగించుకొని నల్లగొండకు వెళ్లాలంటే హైదరాబాద్‌కు వెళ్లే బస్సులు నల్లగొండ మీదుగా వెళ్లకుండా నేరుగా బైపాస్ నుంచి వెళ్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సులు నిలుపుదల చేయకపోవడంతో తాము ప్రతి రోజు ఇబ్బందులు పడుతున్నామని, డ్రైవర్లు కూడా నల్లగొండలో స్టాప్ లేదని అంటున్నారని చెబుతున్నారు. ఈ విషయంపై ఆర్టీసీ డీఎం బొల్లెద్దు పాల్ మాట్లాడుతూ రాత్రి 10గంటల వరకు కూడా నల్లగొండకు ఆర్టీసీ బస్సులు ఉన్నాయని, సూపర్ లగ్జరీలు, నాన్ స్టాప్ బస్సులకు నల్లగొండలో స్టాప్‌లేదని పేర్కొన్నారు. గత పదేళ్లుగా ఇది కొనసాగుతుందని చెప్పారు. రాత్రి 10:30 గంటల వరకు కూడా నల్లగొండకు బస్సులు ఉన్నాయని తెలిపారు.

ఆస్తి పన్ను బకాయి.. షోరూం సీజ్



షోరూంను సీజ్ చేస్తున్న అధికారులు

మిర్యాలగూడ టౌన్: ఆస్తి పన్ను బకాయి చెల్లించకపోవడంతో బుధవారం మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలోని వీవీసీ ట్రాక్టర్ షోరూంను సీజ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. వీవీసీ ట్రాక్టర్ షోరూం రూ.7,77,536 ఆస్తి పన్ను బకాయి ఉండడంతో, ముందస్తుగా రెడ్ నోటీసులు జారీ చేసినప్పటికీ వారి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో షోరూంను సీజ్ చేశామని అన్నారు. బకాయిదారులకు వడ్డీపై 90శాతం రాయితీ ఉందని, ఈ నెల 31వ తేది వరకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ ఆర్ఓ కళ్యాణి, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రాకేష్‌కుమార్, రవి, బిల్ కలెక్టర్లు యాదగిరి, ఖలీల్, బిక్షం, రమేష్, ఎల్లయ్య, సురేష్, సిబ్బంది సైదులు, శ్రీను తదితరులున్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నల్లగొండ టౌన్ : ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు రీజినల్ మేనేజర్ రంజయ్‌కుమార్ మిశ్రా అన్నారు. నల్లగొండ పట్టణంలోని రామగిరి రోడ్డులో ఆధునీకరించిన బ్యాంకు భవనం, ఏటీఎం సెంటర్‌ను బుధవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మరో 80 బ్రాంచ్‌లను ఏర్పాటు చేయడానికి ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రీజినల్ మేనేజర్

పోటీ పరీక్షలకు ఉచితంగా దరఖాస్తులు తీసుకోవాలి



మాట్లాడుతున్న బొమ్మరబోయిన నాగార్జున

నల్లగొండ టూటౌన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినవిధంగా ఉద్యోగ పోటీ పరీక్షలకు ఫీజు లేకుండా ఉచితంగా దరఖాస్తులు తీసుకోవాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున డిమాండ్ చేశారు. బుధవారం నల్లగొండలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టెట్, డీఎస్సీ, గ్రూప్స్ పరీక్షల దరఖాస్తు ఫీజు రూ.1000 వసూలు చేస్తున్నారని, తక్షణమే ఫీజు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నోముల క్రాంతియాదవ్, రొమ్ముల నాగయ్య, నోముల శంకర్ తదితరులున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు



మిర్యాలగూడ పట్టణంలోని నేతాజీ కూరగాయల మార్కెట్ వద్ద ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్న పోలీసులు

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని పలు వీధుల్లో ట్రాఫిక్ సమస్య ప్రతి నిత్యం ప్రజలను వేధిస్తోంది. పాదచారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై పట్టణ ప్రజలు పలుమార్లు పోలీసులకు మొర పెట్టుకున్నారు. ఈమేరకు గత రెండు రోజులుగా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు ప్రారంభించారు. పట్టణంలోని ప్రధాన రోడ్డు అయిన సాగర్‌రోడ్డులో తోపుడు బండ్లు రోడ్లపై పెట్టకుండా వారికి మార్జిన్ చూపించి ఆ స్థానంలోనే బండ్లు ఉంచాలని ఆదేశించారు. దీంతో సాగర్‌రోడ్డులో కొంత వరకు ట్రాఫిక్ సమస్య తీరింది. అదే విధంగా పట్టణంలోని నేతాజీ కూరగాయల మార్కెట్ పరిధిలోని పలు వీధుల్లో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు మార్కెట్ పరిసరాల్లో ఉన్న దుకాణాదారులు తమ సమాన్లను మొత్తం రోడ్లపై పెట్టకుండా దుకాణాల్లోనే పెట్టుకోవాలని వారికి సూచించారు. మార్కెట్ ప్రాంతంలో ఎక్కడ పడితే అక్కడ ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయకుండా పాత బస్టాండ్ స్థలంలో వాహనాలను పెట్టేవిధంగా చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చేపట్టిన చర్యలతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.